# నల్ల మచ్చల తెల్ల పిల్లి

ఆ పిల్లి మొఖం తెల్లగా వుంటుంది. కాళ్లు సగంవరకూ తెల్లగా వుంటాయి. మిగతాది అంతా నలుపే. అంటే వీపు, చెవులు, కాళ్లు కొంత మేరా, తోక, అంతా నలుపే. దానికి వున్న నల్ల భాగమే ఎక్కువ. కానీ అది నల్లపిల్లి అనడానికి వీలులేదు. అంటే వాళ్ళు ఒప్పుకోరు. అది దీక్షితులుగారి పిల్లి. నల్లపిల్లి అంటే ఆయనకు చాలా కోపం వస్తుంది. దానికి అక్కడా అక్కడా నల్లటి మచ్చలున్నాయికాని అసలు అది తెల్లపిల్లి అంటారాయన. ఆయన మాటకి తిరుగులేదు ఆయనకి అది అంటే చాలాముద్దు. మజ్జిగా, అన్నం తినేటప్పుడు ఆయన దానికి ఒక ముద్ద వదిలిపెడతారు. అంతే. అది వంటింట్లోకి రావడానికి వీలులేదు. వస్తే కాళ్లు విరుగుతాయి. దానికి అముర్థ అవతల పడెయ్యవలసిందే.

దీక్షితులుగారికే ఇంకో పేరుంది అగ్గిరాముడని. ఆయనకి ఇప్పుడు 60 ఏళ్లుంటాయి. ఆయన కా పేరు 30 ఏళ్లనుంచివుంది. అంటే ఆ పేరు రావడానికి చాలా ముందునుంచి అన్నమాట. ఆయనకి 60 ఏళ్ళు; ఆయన పేరుకి 30 ఏళ్ళు. అగ్గిరాముడంటే, అగ్గి అంటే నిప్పు - కోపం ముక్కు మీదవుంటుంది. అందుచేత అందరికీ ఆయనంటే చాలాభయం. ఆయన ఏదంటే అది నిజంగా ఇష్టంలేకపోయినా ఒప్పుకు తీరవలసిందే. ఈ 60 ఏళ్లాయి ఆయనమాట అలాగే చెల్లుతూంది. ఆయన చాలా గొప్ప పండితుడు. గుక్క తిప్పకుండా ఎన్నైనా శ్లోకాలు చదవగలడు. ఎన్నైనా తిట్లుకూడా తిట్టగలడు. అలాటి అగ్గిరాముడికి ఆయన తమ్ముడికీ 30 ఏళ్ల క్రిందట దెబ్బలాట వచ్చింది. అది ఆస్తి పంపకాలలో. అంటే తమ్ముడేమీ దెబ్బలాడలేదు. దెబ్బలాట అంతా దీక్షితులుగారే ఆడేశారు. ఆడేసి ఇల్లు, భూమి పంపకాలు చేసేశారు. ఇంటి భాగానికి గోడలు అడ్డు పెట్టించేశారు. పెరటిలో నూతికి కూడా మధ్యగోడ పెట్టించేశారు. అంటే ఒకళ్ల మొఖా లొకళ్లకి కనిపించకుండా చేసేశారు. పెరట్లో నూతిదగ్గిరికి వెళ్ళినా ఒకళ్ళమొఖా లొకళ్లకి కనుపించవు. ఆ నూతిలో నీళ్ళు అసలే కనుపించవు. అవి పాతాళంలోనే ఉన్నాయి. అంచేత నూతిలో నీళ్లలో నీడకూడా కనుపించదు. వీధులోకి వెళ్లినా ఒకవేళ తమ్ముడు ఎదురువస్తే దీక్షితులుగారు గభుక్కుని వెనక్కి తిరిగి పోతారు. ఆయనకళ్ళు ముందుకుండడం చేత వెనకనున్న తమ్ముడు కనిపించడు.

## కోటమర్తి భ్రమరాంబ

అలాంటి దీక్షితులుగారి పిల్లి ఆ నల్లమచ్చల తెల్లపిల్లి. అంచేత దానిని నల్లపిల్లి అనడానికి వీల్లేదు. అంటే అగ్గిరాముడికి ఆహుతి అవవలసిందే. ఆయన మాట కాదని బతకడం కష్టం అని ఇదివరకే చెప్పాను కదూ. ఇంతాచేసి ఆ పిల్లి అందరిదీని. అంటే అందరిళ్లలోనూ తిరుగుతుంది. అందరిళ్లలోనూ పాలూ, పెరుగూ తాగుతుంది. దొరికితే ఎలకల్ని కూడా తింటుంది. కానీ అవి సాధారణంగా దొరకవు. వాటిని గురించి అది అంత బాధపడదు. కానీ పాలూ, పెరుగూకోసం చాలా తంటాలుపడుతుంది. మేము రోజూ పాలుతాగే వేళకి మా ఇంటికి వస్తుంది. గ్లాసు క్రిందపెట్టే దాకా ఓపిగ్గా కాసుకూచుంటుంది. గ్లాసు క్రిందపెట్టగానే గ్లాసులో అడుగునవున్న పాలు ముందుకాలు గ్లాసులోముంచి, మజ్జిగా అన్నం జుర్రినట్లు జుర్రుతుంది. మేము రోజూ తప్పక కొన్నిపాలు దానికోసం వుంచుతూ వుంటాము. ఒకవేళ గ్లాసు వేగిరం పెట్టకపోతే (మ్యావ్) అంటుంది. అంటే నాకు అవతల చాలాపనుంది గ్లాసు వేగం ఇవ్వకపోతే ఎలాగాఅని. అది ఒక్కరోజు రాకపోతే మాకేమీ తోచదు.

ఆ నల్లమచ్చల తెల్లపిల్లి, అంటే దీక్షితులుగారిపిల్లి, ఆవేళ దీక్షితులుగారు భోంచేస్తూ వుంటే దానిమజ్జిగా ముద్దాకోసం వెళ్లి గుమ్మంలో కాసుకూచుంది. కానీ ఆవేళాయన అగ్గిరాముళ్లా వున్నారు. కూరలో ఖారం ఎక్కువయిపోయింది. కళ్లల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. ముక్కుల్లో నీళ్ళు కారిపోతున్నాయి. ఆయనపెళ్లాం ఎప్పుడూ వెధవ్వంట చేస్తుంది. 40 ఏళ్లనుండీ కాపరం చేస్తూన్నా మొగుడికి ఎలాగచేస్తే బాగుంటుందో ఇప్పటికింకా తెలియదు. ఇంక తెలిసేదేమిటి? ఈజన్మకింతే. ఇలావుంది లోపల వరుస. గుమ్మంలోకూర్చున్న పిల్లికి తొందరగావుంది. ఆకలవుతోంది. వేళ చాలా అయిపోయింది. ఇంకా అవతల బోలెడుపనులున్నాయి. ఎంతోసేపు ఇక్కడ కూర్చుంటే ఎలాగ. కానీ ఏంచేస్తుంది. అడగడానికి లేదు. దీక్షితులుగారి కోపం దానికి కూడా తెలుసు. ఒకసారి ఆయనచేతిలో దాని ముక్కు విరిగింది. మూడురోజులు కుంటింది. అంచేత మ్యావ్ అనదు. అంటే మళ్లీ విరుగుతుంది. చూసిచూసి ఎంతకీ ముద్ద పడకపోతే ఏమోఅని, చూద్దామని లోపలికి అడుగు పెట్టింది. పెట్టిందో లేదో ఆయన కళ్ల పడింది. ఇంకేముంది. అసలే అగ్గిరాముడు. "హాంఫ్ మాఘచ్చోదు ముండా" అన్నారు. ఇంకా అనకుండానే, పక్కనున్న గ్లాసు ఎడంచేతోతీసి దానిమీమీదికి విసిరారు.

కానీ ఆయన గ్లాసు తీసి, విసిరి, అది మీద పడేదాకా అది వుంటుందా. ఛంగున గెంతి పెరట్లోకి పరిగెత్తింది. వెనక్కి తిరిగి చూడలేదు. చూస్తూవుంటే మీద ఏమివచ్చి పడుతాయో మరి. గెంతి పరుగెత్తి పెరట్లోకి వెళ్లేసరికి ఇంకేముంది. చుట్టూ పెద్ద ఎత్తయిన ప్రహరీగోడలు, మధ్యలోమాత్రం నుయ్యి, దానికి సగానికి వేసిన అడ్డుగోడా వున్నాయి. పిల్లికి ముందుచూస్తే నుయ్యి, వెనకచూస్తే దీక్షితులుగారూ. ఈ దీక్షితులుగారికన్నా


దేశసౌభాగ్యానికి జాతీయ ప్రోత్సాహము ఎంతో అవసరం

అలాగే ఆంధ్రాభ్యుదయానికి ఆంధ్ర సంస్థలను ఆంధ్రులు
ప్రోత్సహించుటకూడా చాలా అవసరం.
ఎల్లవేళలా మీ ఆరోగ్య రక్షణకు వలయు సమస్తమందులను
సరసమైన ధరలకు విక్రయించు ఏకైక
ఆంధ్ర సంస్థ

స్వామి సన్స్

మందుల వ్యాపారులు

అబిడ్ రోడ్డు, హైదరాబాదు, (దక్కన్.) ఫోన్ 5498:

అసుర్యే వయ తుసుకున్నట్టుంది. నూతిగోడ మీదనుంచి గెంతింది. మధ్యలో నూతిలో పడింది.

ఇంతలో దీక్షితులుగారు పిల్లిని కొడదామని పరిగెట్టుకుంటూ పెరట్లోకి వచ్చారు. వచ్చి పిల్లి నూతిలో పడడం కళ్లారాచూశారు. (హామ్మోముండా) అన్నారు. దీక్షితులుగారి పెళ్లాంకూడా వెనకాతలే వచ్చింది. (అయ్యో)పిల్లిచస్తే బ్రహ్మహత్య అంది. దీక్షితులుగారికోపం వెంటనే పోయింది. అగ్గిరాముడు అయిస్ రాముడు అయిపోయాడు. పిల్లేమయిందోనని నూతిదగ్గిరికి వెళ్లి ఇద్దరూ చూశారు. అప్పటికప్పుడే నూతిలో అడుగునున్న నీళ్లలోపడ్డ నల్లమచ్చల తెల్లపిల్లి ఈదుకుంటూ వడ్డుకి వచ్చింది. ఒడ్డునున్న ఒక పెద్దబండమీదకి మెల్లిగా చేరుకుంది. ఒళ్లు దులిపేసుకుంది. తోక ఝాడించేసింది. బండపక్కనున్న ఒక కన్నంలోకి దూరింది. అదికూడా దీక్షితులుగారి ఇంటివేపే, తమ్ముడిగారి ఇంటివేపు కాదు. మరి అది దీక్షితులుగారి పిల్లి. ఇది అంతా దీక్షితులుగారూ భార్యా చూశారు.

ఇంక దీక్షితులుగారి భార్యకి సమయం దొరికింది! ఇంతసేపూ వున్నకసి తీర్చుకోడానికి అదేమిటండీమీకోపం బంగారంగానూ నోరులేని పిల్లిముండమీద అంతకోపమా! మీ సాహ్యకి వునూరుమని ఆ ముండ నూతిలో పడే చచ్చును. ఎంతపని అవును. పిల్లి బ్రహ్మహత్య! ఇన్నేళ్లూ వచ్చి ఇంతచదువూ చదివి అంతకోపమయితే ఎలాగండి? అని అక్కసు తీర్చుకుంది. ఇంక పిల్లిని నూతిలో నుంచి తియ్యాలి లేకపోతే అది ఛస్తుంది. పిల్లిచస్తే బ్రహ్మహత్య! పండితుడయిన దీక్షితులుగారు పిల్లిని ఎలాగేనా బతికించి మహాపాతకంనుంచి తప్పించుకోవాలి. ఎలా పిల్లిని తియ్యడం? ఆలోచించి మెల్లిగా తాడుతో బాల్చీ నూతిలో గోతివేపు దింపేరు. పిల్లి బాల్చీలో దూరి కూర్చుంటే నీళ్లు తోడినట్లు తోడి పారేయొచ్చని. బాల్చీదగ్గరకు వచ్చేసరికి పిల్లి తెల్లటి రెండుకాళ్లూ ముందుకి చాచింది. తలపైకెత్తి చూసింది చూసేసరికి దీక్షితులుగారి మొఖం ఆత్రంగా చూస్తూ కనిపించింది. దానికి భయంవేసింది. మళ్లీ ఆయన ఏ గ్లాసు మీద విసురుతాడో అని లోపలకి పారిపోయింది. ఈ దీక్షితులుగారి చేతులో పడ్డంకన్నా ఆ నూతిలోవున్న గోతిలో వుంటేనే నయం అనుకుంది. పాపం పిల్లి కేంతెలుసు దీక్షితులుగారి కంగారు!

ఇలా బాల్చీవేసి పిల్లిని తియ్యాలని దీక్షితులుగారు భార్య పావుగంట తంటాలు పడ్డారు. లాభం లేకపోయింది. ఉపాయం తోచడంలేదు. పాపం నెత్తిముండ ఒక్క ముద్ద అన్నంకోసం వస్తే ఎంతపనయిపోయింది! అన్నంలేదు సరికదా ఎంతాక




# ★ నల్లమచ్చల తెల్లపిల్లి ★

లేస్తుందో! పైకివస్తే వెర్రిముండకి కడుపు నిండా పెరుగుఅన్నం పెట్టవచ్చు. కానీ రాదే వెధవ. అది కత్తు కట్టినట్లుంది. పైకి రాకుండా అలాగే నూతిలో వుండి, తిండి లేకుండా మలమలమాడి చచ్చి ఆ మహా పాతకం దీక్షితులుగారి మెడకి చుడదామని చూస్తూంది. కానీ మహాపండితుడైన దీక్షితులుగారు ఇలాంటి మహాపాతకానికి వప్పుకుంటారా! ఇది నూతిలోంచి పైకి రాక పోయినా చావకూడదన్నమాట. దానికి వుపాయం ఆలోచించారు. పిల్లి పైకిరాక పోయినా అన్నమే పిల్లిదగ్గిరకు పంపుతే! తింటుంది చావదు. తరువాత ఎలాగో వుపాయంచేసి పైకి తీయవచ్చు. ఒక చిన్న బుట్టలో పెరుగూ అన్నం పెట్టారు. చాలా అన్నం పెట్టారు. అంటే రోజూ ఆయనవేసే ఒకముద్దకాదు. ఆయనకీ తెలుసు అది ఆముద్దతోనే బ్రతకడంలేదని. అంచేత చాలా అన్నం కలిపి బుట్టలోపెట్టి బుట్టకే తాడుకట్టి నూతిలోకి దింపారు. అన్నం చూడగానే పిల్లి ముందుకు వచ్చింది. రెండు కాళ్లూ బుట్టలో పెట్టింది. అన్నం అంతా గబగబ తినేసింది. ఆకలిమీద గుండేమొ! "కానీ ముండ రెండుకాళ్లే బుట్టలో పెట్టింది. మిగతా రెండూ కూడా పెట్టి, బుట్టలో కూర్చుంటే తోడెయ్యొచ్చు" అనుకున్నారు దీక్షితులుగారు. "కానీ పైకివస్తే మళ్లీ ఈయన చేతిలో పడాలి. ఇదే నయం. బాగా ఎప్పుడూ పెట్టనంత అన్నం పెట్టారు. హాయిగా తినేసి ఇక్కడే కూర్చుంటే నయం. పైకి వచ్చేం చెయ్యాలి. అన్నమా? చచ్చినట్లు ఆయనే పెడతాడు" అనుకుంది. పిల్లి రెండుకాళ్లే బుట్టలో పెట్టింది. బుట్ట లాగితే మళ్లీ నూతిలో నీళ్లలో పడిపోతుంది. ఎలాగో ఒకలాగ అది బ్రతికితే అదే పదివేలు. ఏదో ఇప్పటికి కొంత బాధ తగ్గింది. అన్నం తిన్నాది. మూల కూర్చున్నది. ఇంక ఫరవా లేదు. మెల్లిగా ఎవరినేనా పిలిచి దానిని తీసే వుపాయం చూడవచ్చు అనుకున్నారు దీక్షితులుగారు. రెండురోజులు దీక్షితులు గారు ఎన్నో విధాల ప్రయత్నం చేసినా పిల్లిని బయటికి తీయలేకపోయేరు. పిల్లి మాత్రం కడుపునిండా అన్నం తిని నూతిలో వున్న గోతిలో హాయిగా వుంది. దీక్షితులు గారు ఇంక వేరే గత్యంతరంలేక ఏనాది రాముడు దగ్గిరకి బయలుదేరారు. కష్టపడి వాణ్ని పట్టుకుని, ఇంటికి తీసుకువచ్చి, నూతిని పిల్లిని చూపించేరు. వాడిప్పుడు ఈ సందర్భంలో ఒక నిపుణుడు అయి కూర్చున్నాడు. వాడు ఎలాగైనా ఆ నూతిలోంచి ఆ పిల్లిని తెస్తేనే దీక్షితులుగారికి మోక్షం. లేకుంటే పిల్లిచస్తే బ్రహ్మహత్య మహా పాతకం. ఏనాదిరాముడు నూతికేసి చూశాడు. దీక్షితులుగారికేసి చూశాడు. పరిస్థితి అర్థమయింది. 'ఏమిస్తారూ' అన్నాడు. 'అడుగు ఏం కావాలో' అన్నారు దీక్షితులుగారు. 'ఒక రూపాయి' అన్నాడు ఏనాది రాముడు. 'హారి ఒకసారి నూతిలో దిగి పిల్లిని తీసెయ్యడానికి రూపాయా.' ఒక్క పావలా ఇస్తానన్నారు. గిరుక్కున వెనక్కి తిరిగాడు ఏనాది రాముడు. 'ఒరే వెధవా' అలా వెళ్లిపోతావేంరా ఏం కావాలో చెప్పుమరి!' అన్నారు దీక్షితులుగారు. 'చెప్పేనుగా' అన్నాడు రాముడు. వాడికి తెలుసు ఎలాగా దీక్షితులుగారు పిల్లిని తియ్యందే వెళ్లనివ్వరని. 'అంతేనా మరోమాటుందా?' అన్నారు ఆయన. లేదు అన్నాడు వాడు ఖచ్చితంగా." ఒరే వెధవా! రూపాయి ఎందుకు, నీకు కడుపునిండా అంటే నువ్వు తిన్నంత అన్నం పెట్టిస్తాను. ఒక పావలా ఇస్తాను తీసెయ్యరా" అన్నారు దీక్షితులుగారు. ఆయన గాదె నిండా ధాన్యం, కావలిసినంత అన్నం పెట్టగలరు. కానీ డబ్బు మాత్రం ఇవ్వడం ఇష్టం లేదు ఆయనకి.

"ఎందుకు బాబూ, ఒక రూపాయ ఇచ్చెయ్యకూడదా?" తరువాత కావలిస్తే అన్నం కూడా పెట్టండి. వెధవ కావలిస్తే అన్నంకూడాపెట్టాలిట. ఎవరికి కావాలిస్తేనో? నాకో? వాడికో? అనుకున్నారు దీక్షితులుగారు. కానీ ఆయనకీ తెలుసు. వాడికి అడిగింది ఇస్తేకాని వాడు తియ్యడు. వాడుత్త మూర్ఖుడు. అదితియ్యకపోతేపిల్లిచస్తే బ్రహ్మహత్య మహాపాతకం! దానికి శాంతి, అన్నదానం, డబ్బుఖర్చు, చాలా బెడద వుంది. ఇంక లాభంలేదు. సరేలే వెధవా! నువ్వన్నట్లే రూపాయి ఇస్తాను తియ్యి" అన్నారు.

ఏనాది రాముడు పెద్ద ఎక్స్‌పర్ట్. అందుకు పూనుకున్నాడు. తలపాగా తీసేశాడు. చొక్కా విప్పేశాడు. పంచె గ్గట్టేడు. పెద్ద మోకుతాడు తీసుకున్నాడు. దానికి మంచి జారుముడి ఒకపక్క వేసేడు. అది దగ్గరున్న స్తంభానికి కట్టేడు. తాడు మరోకొసకి పెద్ద బుట్ట కట్టేడు. బుట్ట నూతిలోకి మెల్లిగా దింపేడు. దీక్షితులుగారు దగ్గిరుండి ఇది అంతా చూస్తున్నారు. బుట్టెందుకన్నారు. పిల్లిని ముందు బుట్టలో కూర్చోపెట్టేస్తాను. తరువాత దానిని బుట్టతో పయికి తీసేస్తా. దాన్ని చేత్తో పట్టుకుని మరి పైకి ఎక్కడం ఎలాగా అన్నాడు. బాగుంది ఉపాయం అనుకున్నారు దీక్షితులుగారు.

బుట్ట నూతిలో దిగింది. పిల్లి చూసింది. కాళ్ళు ముందుకి పెట్టింది. తల పైకి తిప్పి చూసింది. పైని ఏనాది రాముడు కనిపించాడు. ఫరవాలేదనుకుంది. అగ్గిరాముడు లేడు. ధైర్యం వచ్చింది. పెళ్లికూతురులా కాళ్లు ముడుచుకుని తల వంచుకుని బుట్టలో కూర్చుంది. ఏనాది రాముడు కొంచెం నిదానించాడు. 'పంతులుగారూ మీరు లోపలికి పోయి తలుపులు వేసుక్కూర్చోండి, పిల్లి చాలా కసిమీద వుంది. పైకిరాగానే దగ్గిర ఎవరేనా కనిపిస్తే గుడ్లు పీకేస్తుం దన్నాడు. దీక్షితులుగారు లోపలికి పరిగెత్తేరు. తలుపులు ఓడాయించేరు. కిటికీ దగ్గర నిలబడి చూస్తున్నారు. ఏనాదివాడు నెమ్మదిగా, జాగ్రత్తగా, పిల్లి మళ్ళీ జారిపడకుండా, తోడుతున్నాడు. పిల్లి పెళ్ళికూతుర్లా బుట్టలో కదలకుండా, తల ఎత్తకుండా కాళ్లు ముడుచుకుని కూర్చుంది.

బుట్ట పైకివచ్చింది. చుట్టూ ఎవరూ లేరు. ఏనాది రాముడు మాత్రమే వున్నాడు. ఫరవా లేదు వాడు మనవాడే అనుకుంది. ఇటూ అటూ చూసింది. బతుకు జీవుడా అనుకుంది. ఒక్క వుదుటున వురికింది. వీధిలోకి పరుగు తీసింది. దీక్షితులుగారు కిటికీలోనుంచి పిల్లిని చూశారు. బతుకు జీవుడా అనుకున్నారు. అది అవతలికి పారిపోయింది. ఇక ఫరవా లేదు. తలుపుతీసుకు వచ్చారు. రాముడు బుట్ట తాడు విప్పేడు. చొక్కా తొడుక్కున్నాడు. తలపాగా పెట్టుకున్నాడు. 'వెంకి' అన్నాడు. 'ఏమిమ్మంటావు' అన్నారు. పంతులుగారూ మళ్ళీ అడుగుతున్నారా అన్నాడు ఏనాదివాడు. 'ఆ' వెధవా ఎంత కష్టపడ్డావు, నువ్వు నూతిలో దిగేవా ఏమైనానా అదే వచ్చేసింది కదా? అన్నారు. ఎలాగైతే నేమి, దాన్ని పైకి తీశానుకదా, అంచేత రూపాయి ఇవ్వవలసిందే అన్నాడు. వాడితో ఏమిటండి ఇచ్చి పంపించెయ్యక అన్నారు దీక్షితులుగారి భార్య. అంత అగ్గి రాముడూ ఏనాది రాముడితో చాలలేక పోయారు. ఆయన పాండిత్యం, కోపం, పలుకుబడీ, వాడిముందు ఎందుకూ పనికి రాలేదు. దీక్షితులుగారు రూపాయి ఇవ్వక తప్పిందికాదు. ఏనాది రాముడు ఇంకా నిల్చున్నాడు. అమ్మా కాస్త అన్నం పెట్టించండమ్మా అన్నాడు. వాడికి తెలుసు పంతులుగారికన్నా అమ్మగారు నయం అని. ఆవిడ పెట్టింది. వాడు తిన్నాడు.

ఇంక పిల్లి సంగతి. అది మళ్ళీ దీక్షితులు గారింట్లో కాలు పెట్టలేదు. ఇక అది దీక్షితులుగారి పిల్లి కాదు. అంచేత ఇప్పుడది నల్ల పిల్లే! నల్లమచ్చల తెల్లపిల్లి కాదు. ★